క్లుప్తంగా

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



కైకలూరు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ట్రావెలర్స్ బంగ్లా నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు హర్ ఘర్ తిరంగా వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దేశ పౌరుడి ఇంటి పైన జాతీయ జెండా త్రివర్ణ పతాకం ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, సర్పంచ్ కేవీఎస్‌ఎం.నాయుడు, కూటమి నేతలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడిగా కాటూరి

పాములపాడు(పెదపారుపూడి): పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడిగా దోసపాడు గ్రామానికి చెందిన కాటూరి నాగ వెంకటకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వుల పత్రాన్ని బ్యాంక్ కార్యదర్శి కుమారి బుధవారం వెంకటకృష్ణకు అందజేశారు. బ్యాంక్ కార్యదర్శి కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం త్రిమాన్ కమిటీని నియమించిందన్నారు. బ్యాంక్ డైరెక్టర్లుగా చిలుకూరి శివశంకర్ (సోమార్పాడు) దూళ్ల శంకర్‌ను (దూళ్లవాని ఎస్సీకాలనీ) నియమించారన్నారు.

అయ్యప్పస్వామికి వెండి ఆభరణాలు అందజేత



పామర్రు(మొవ్వ): పామర్రులోని అయ్యప్ప స్వామి దేవస్థానంలోని స్వామివారికి వెండి కిరీటం, కవచకుండలాలు (చెవులకు ధరించేవి) ప్రముఖ వస్త్ర వ్యాపార వేత్త (బిన్నీ షాపు) ముప్పిడి బాబు పార్థసారథి కుటుంబ సభ్యులు బుధవారం అందజేశారు. స్వామివారికి అష్ట ద్రవ్యములతో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి బొగరపు సాయిబాబు, తాడిశెట్టి మధు శేఖర్, శ్రీనివాసరావు, తాడిశెట్టి సాంబశివరావు, అల్లంశెట్టి పవన్ తదితరులు పాల్గొన్నారు.

సోమనాథ్ ఛటర్జీకి నివాళి

పామర్రు(మొవ్వ): లోక్‌సభ మాజీ స్పీకర్, అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత సోమనాథ్ చటర్జీ ఏడవ వర్ధంతిని బుధవారం పామర్రులో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమనాథ్ చటర్జీ చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకులు కాటూరి నాగభూషణం, దునుకు రఘునాథరావు, వేము పెదబాబు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పమిడిముక్కల: ప్రమాదం చెప్పిరాదని...అప్రమత్తత అవసరమని విద్యుత్ ఏఈ బి.శ్రీనివాసరావు తెలిపారు. వాయుగుండం ప్రభావంతో గాలులు, వర్షాలు పడే అవకాశముందని అన్నారు. విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా వినియోగదారులు, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడిచిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని, తడిచిన చేతులతో స్టార్టర్లు, మోటార్లు వేయకూడదని తెలిపారు. విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను, తడి చేతులతో ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను ముట్టుకోకూడదని సూచించారు. గాలి, దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను పట్టుకోకూడదని పేర్కొన్నారు. విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు.

పిడుగుపడి పశువుల పాక దగ్ధం

పమిడిముక్కల: మండలంలోని ఐనంపూడి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి పిడుగుపడి కొల్లి శ్రీనివాసరావుకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. ఈ ప్రమాదంలో పాకలోని రెండు గేదెలు, దూడ, ఎద్దు కాలిపోయి మృతి చెందాయి. రూ.4 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. హనుమంతపురం పీఏసీఎస్ చైర్మన్ రాజుల పాటి రామాంజనేయప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తిరుమలశెట్టి బోసుబాబు బుధవారం ఐనంపూడి వెళ్లి శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పశువైద్యులు వెంకటేష్ మృతి చెందిన పశువులను పరిశీలించి పోస్టుమార్టం చేశారు. రాత్రి కురిసిన వర్షానికి పిడుగుపడి పశువులు మృతి చెందాయని బాధితుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

57 బస్సులు కేటాయింపు

గుడివాడ టౌన్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం స్త్రీశక్తి అమలులో భాగంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ డి. రాజేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి మహిళల కోసం పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్టీసీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ వంటి బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని చెప్పారు. గుడివాడ డిపోలో మొత్తం 87 బస్సులు ఉండగా 57 బస్సులను మహిళల ఉచిత బస్సు పథకానికి కేటాయించినట్లు ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌కు మోక్షం ఎప్పుడో?

గుడివాడ టౌన్: ఆర్టీసీ బస్టాండ్ బాగుపడే సూచనలు కనుచూపు మేరలో కనిపించడంలేదు. నాలుగు దశాబ్దాలుగా ఈ బస్టాండ్ వర్షం వస్తే నీట మునగడం, ప్రయాణికులు అవస్థలు పడటం సర్వసాధారణం అయిపోయింది. డివిజన్ కేంద్రం కావడం, ప్రజలకు కావాల్సిన అన్ని అవసరాలు తీర్చే వ్యాపార కూడలి కావడంతో గుడివాడ పట్టణానికి ప్రతిరోజు వేలాదిగా ప్రయాణికులు వస్తూ పోతుంటారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో భాగంగా గుడివాడ ప్రజల చిరకాల వాంఛ అయిన బస్టాండ్ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అన్నమాట నిలుపుకుంటూ 2023లో బస్టాండ్ అభివృద్ధికి రూ. 22 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. వెంటనే పనులు ప్రారంభించారు. అప్పటి ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో పనులు వేగవంతంగా జరిగాయి. రూ. 10.20 కోట్లతో ఆర్టీసీ డిపో, కార్యాలయం, గ్యారేజి అభివృద్ధి పనులు చకచకా జరిగిపోయాయి. మిగిలిన మొత్తాలలో రూ. 5.5 కోట్లతో బస్టాండ్ ఎత్తుపెంచడం, అధునాతన బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. మిగిలిన మొత్తాలతో కమర్షియల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు డీపీఆర్ తయారు చేసి ఆమోదం పొందారు. కానీ 2024 ప్రారంభం లోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలుపుదల చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దుచేస్తూ కొత్త బస్టాండ్ నిర్మాణ బాధ్యతలు తామే చేపడతామని



నీట మునిగిన బస్టాండ్

స్థానిక టీడీపీ కూటమి నాయకులు ప్రజలకు తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం నాలుగు నెలలు పూర్తవుతున్నా దాని ఊసే ఎత్తడంలేదు. ఒకప్పుడు గుడివాడ ప్రజల ఓట్లతో పార్లమెంట్ సభ్యునిగా గెలిచిన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ ఆర్టీసీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే గుడివాడ డిపోను సందర్శించి నూతన బస్టాండ్ నిర్మాణం వెంటనే చేపడతామని హామీ ఇచ్చారు. ఘనంగా సత్కారాలు చేయించుకున్నారు. తాను ఎంపీగా పనిచేసిన నాటి నుండి గుడివాడ ప్రయాణికులు బస్టాండ్‌లో పడుతున్న అవస్థలు తనకు తెలుసునని వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయన పదవి చేపట్టి ఆరు నెలలు పూర్తయింది. ఇప్పటికి కనీసం ప్రతిపాదనలు కూడా చేసినట్లు సమాచారం లేదు. దీనిపై డిపో మేనేజర్ రాజేష్‌కుమార్‌ను వివరణ కోరగా ఆర్టీసీ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. వారు నిర్ణయించే వరకు తామేమీ చేయలేమని తెలిపారు. ఇప్పటికైనా ఆర్టీసీ చైర్మన్, స్థానిక నాయకులు, గుడివాడ ఎమ్మెల్యే ప్రయాణికుల సమస్యలు గుర్తించి వెంటనే నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి బస్టాండ్ ప్రాంగణం చెరువుగా మారింది. ప్రయాణికులు రోడ్లపైనే బస్సులు ఎక్కుతూ అవస్థలు పడ్డారు. ట్రాఫిక్‌కు పూర్తి అంతరాయం కలగటంతో ప్రజలు సైతం కూటమి ప్రభుత్వం బస్టాండ్ నిర్మాణంపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం



జలమయమైన పెదపూడి జగనన్న కాలనీ

మొవ్వ: మండలంలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కూచిపూడి, పెదపూడి, అయ్యంకి, పెడసనగల్లు, భట్లపెనుమర్రు, కొండవరం, పెదముత్తేవి, కోసూరు, కాజ, పెద్దారాయుడు తోట గ్రామాల్లోని రహదారులు జలమయమయ్యాయి. గాలితో కూడిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో గంటల తరబడి ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. పెదపూడి గ్రామంలోని జగనన్న కాలనీ జల దిగ్బంధంలో చిక్కుకు పోయింది. ఖాళీగా ఉన్న స్థలాలే కాకుండా అంతర్గత రహదారులు సైతం జలమయమవ్వటంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలనీకి ఒక వైపు ఉన్న మురుగు కాలవలోని నీరు పోటెత్తటం.. రైతులు పంట పొలాల్లోంచి నీరు మురుగు కాలువలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న తూముల ద్వారా కాలనీలోకి నీరు ఎదురు రావటంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. మురుగు కాలవకు నీరు వచ్చిన ప్రతిసారీ ఇదే పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు. దీని పై పంచాయతీ అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

కాలనీలు జలమయం

ముదినేపల్లి రూరల్: మండలంలో కురుస్తున్న వర్షానికి పలు కాలనీలు జలమయ్యాయి. బుధవారం



సింగరాయపాలెం వైఎస్సార్ కాలనీకి వెళ్లే రహదారిలో నిలిచిన వర్షపునీరు

మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా కురిసిన వర్షంతో కాలనీల్లో నీరు నిలిచిపోయి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాల్లో సైతం నీరు నిలిచిపోతుందనే భయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు చేస్తున్న నేపధ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే పలు కాలనీల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం కురిసిన వర్షానికే మండలంలోని పెయ్యేరు వైఎస్సార్‌కాలనీ, శ్రీహరిపురం బీసీ కాలనీ, సింగరాయపాలెం జగనన్న కాలనీల్లోని రోడ్లపై నీరు నిలిచిపోయింది.

అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానం వద్దు

ముదినేపల్లి రూరల్: పాఠశాలల పనివేళల్లో బోధనా సమయాన్ని హరించే విధంగా ఉన్న అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ మండల సమావేశం సంఘ అధ్యక్షుడు కృపాకర్ ఆధ్వర్యాన ముదినేపల్లిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పరీక్షా పేపర్లు ఇంటివద్ద దిద్దే పద్ధతికి బదులు నేడు మూల్యాంకన పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లలేని స్థితి ఏర్పడిందన్నారు. వందలాది పుస్తకాలను ఇళ్ళకు మోసుకుని వెళ్లడం ఏవిధంగా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. పాఠశాలలో మూల్యాంకనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడి పాఠ్యాంశాల బోధనకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. దీనిని గ్రహించి అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానం ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, నాయకులు జాన్సన్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

గుడివాడరూరల్: మాంటిస్సోరి మహిళా సంఘ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. స్థానిక రాజేంద్రనగర్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో పాలకవర్గ సభ్యులు సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఆ సమయంలో సంబంధం లేని కొంతమంది మహిళలు వచ్చి స్కూల్ గేటును దౌర్జన్యం తోసుకుంటూ లోపలికి వచ్చి సంఘ సభ్యులతో ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు వేసుకున్న షామియాన టెంట్లను, కుర్చీలను బయట నుంచి వచ్చిన మహిళలు తొలగించి చిందరవందరగా పడేశారు. సమావేశం జరిగే ప్రాంతంలో పోలీసులు ఉన్నా వారు కూడా ఏమి చేయలేక చేతులెత్తేశారు. ఈ సందర్భంగా మహిళా మండలి అధ్యక్షురాలు వల్లూరిపల్లి లక్ష్మి మాట్లాడుతూ గుడివాడలో 1945సంవత్సరంలో మహిళ సంఘం ఏర్పడిందని, ఇలాంటి దౌర్జన్యాలు, దాడులు ఎప్పుడు జరగలేదన్నారు.

బీసీ కాలనీలో అధ్వానంగా పారిశుద్ధ్యం

పెదపారుపూడి: మండల కేంద్రంలోని బీసీ ఏరియాలో పాల బజార్ అంతా మురుగునీరు నిల్వ ఉండి అత్యంత దారుణంగా ఉంది. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పరిస్థితి దారుణంగా ఉంది. బజార్‌కు ఇరువైపులా డ్రైనేజీ లేకపోవటంతో ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉంటుంది. గత వారం రోజుల నుంచి పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నా పంచాయతీ అధికారులు కనీసం బ్లీచింగ్ సైతం చల్లలేదని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయంలో వచ్చే మురుగు వాసన భరించలేకపోతున్నమని ఆవేదన చెందుతున్నారు. ఎంతో కాలం నుంచి మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలకు నివాసంగా మారింది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని స్థానికులు అంటున్నారు. దోమల వల్లన ఎక్కడ జర్వాలు వస్తాయోనన్ని గ్రామస్తులు అంటున్నారు. దోమ కాటుతో రాత్రి సమయంలో కంటి మీద కునుకు ఉండటం లేదని మహిళలు అంటున్నారు. మండల స్థాయి అధికారులకు కూత వేటు దూరంలో ఉన్న బీసీ ఏరియాలో నెలకొన్న సమస్యను చెప్పినా పట్టించుకోవటంలేదు. ఒకసారి వచ్చి చూసి సమస్య ఉంటే పరి



రోడ్డు మధ్యలో నిల్వ ఉన్న నీళ్లపై ఉన్న దోమలు

ష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. మండల స్థాయి అధికారులు ఎంత సేపు కార్యాలయంలో ఉంటే సరిపోతుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాము పడుతున్న ఇబ్బందులు పట్టించుకోరా నిలదీస్తున్నారు. పాలబజార్ లో పారిశుద్ధ్యం దారుణంగా ఉందని స్థానికుడు జె.జగన్నాథం తెలిపారు. రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటంతో దోమల నీళ్లపై కనిపిస్తున్నాయని చెప్పారు. కనీసం బ్లీచింగ్ గానీ దోమల మందు గానీ పిచికారీ చేయడం లేదని వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించాలని లేకపోతే ఈ ప్రాంతంలో జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

పంచాయతీలో అవకతవకలపై విచారణ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరు పంచాయతీలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై డీడీఓ లక్ష్మీ బుధవారం విచారణ నిర్వహించారు. పంచాయతీలో ఇంటి పన్నులు, ప్రైవేటు నీటి కుళాయిల డిపాజిట్లు పంచాయతీ ఖాతాకు జమచేయకుండా నిధులు దుర్వినియోగం చేశారంటూ డి. చంద్రకాంత్ జిల్లా కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై డీడీఓ విచారణ చేపట్టగా సర్పంచ్ అల్లు సుశీల అప్పటి కార్యదర్శి వై.శ్యాంసుందర్ ఫిర్యాదుదారు చంద్రకాంత్ హాజరయ్యారు. విచారణ జరుగుతుండగా సర్పంచ్ సుశీల తన చెక్‌పవర్ రద్దు చేశారని, దీనిపై కోర్టులో కేసు నడుస్తున్నట్లు డీడీఓ దృష్టికి తెచ్చారు. దీంతో కోర్టులో ఉన్న అంశానికి సంబంధించి విచారణ చేయడం సమంజసం కాదని దీనిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అభిప్రాయం కోరిన తరువాత మాత్రమే విచారణ



పెయ్యేరు పంచాయతీలో విచారణ నిర్వహిస్తున్న డీడీఓ

చేస్తామని చెబుతూ మధ్యలోనే విచారణ నిలిపివేశారు. పంచాయతీకి సంబంధించిన రికార్డులను మాత్రం సీజ్ చేసి డీడీఓ బృందం తమ వెంట తీసుకువెళ్లారు. విచారణ సందర్భంగా ఏఎస్సై ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సచివాలయం వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

పామర్రు(మొవ్వ): పట్టణ పరిధిలోని గంగానమ్మ తల్లి ఆలయం వద్ద గల పామర్రు పాల సేకరణ కేంద్రం వద్ద పాడి రైతులకు 227 మందికి గడచిన నాలుగు నెలలకు బోనస్ గా రూ.3,50,979 సంఘ అధ్యక్షుడు బొమ్మ రెడ్డి కృష్ణారెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఆపల్లి శ్రీ హరి, టెస్టర్ యార్లగడ్డ శ్రీను, పాడి రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల సాయంతో పోయిన పర్సు గుర్తింపు

కైకలూరు: సీసీ కెమెరాల ఆధారంగా మహిళ పోగొట్టుకున్న పర్సును పోలీసులు గుర్తించి బాధితురాలికి అప్పగించారు. కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామానికి చెందిన వివాహిత జ్యోతి కైకలూరు వెంకటరమణ థియేటర్ వద్ద మంగళవారం రాత్రి 9.50 సమయంలో ఆటో నుంచి దిగి పర్సు మర్చిపోయింది. అందులో రూ.13 వేల నగదు, డెబిట్, పాన్, ఏటీఎం కార్డులు, విలువైన పత్రాలు ఉన్నాయి. పర్సు పోగొట్టుకున్న విషయం గమనించిన ఆమె టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే ఎస్సై ఆదేశాలతో రంగంలోకి దిగిన కానిస్టేబుల్ కె.నాగార్జున సీసీ కెమెరాలను పరిశీలించారు. చివరకు ఆటోను గుర్తించారు. ఆటోలో వెతకగా పర్సు అక్కడే ఉంది. బాధితురాలికి టౌన్‌స్టేషన్‌లో సీఐ పి.కృష్ణ, ఆర్.శ్రీనివాస్ బుధవారం పర్సు అప్పగించారు. పోలీసుల తక్షణ సాయానికి ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

సాహిత్యంతో వ్యక్తిత్వ వికాసం



గుడ్లవల్లేరు: వ్యక్తిత్వ వికాసానికి సినీ సంగీతం, సాహిత్యం శక్తివంతమైన సాధనాలని విజయవాడ జి.వి.ఆర్. ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రతినిధి కందుల లక్ష్మి నరసమ్మ అన్నారు. శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం తొలి సంవత్సరం విద్యార్థులకు సినీ సంగీతంలో వ్యక్తిత్వ వికాస పరిమళం అనే అంశంపై తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మి నరసమ్మ మాట్లాడారు. గాయకులు మల్లిక్, స్వాతి తమ గాత్ర సహకారాన్ని అందించగా, కీపేడ్ కు రవి, రిథమ్ పేడ్‌కు రమణ చక్కటి సంగీత సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, డైరెక్టర్ డాక్టర్ పి.సిద్ధయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతామహాలక్ష్మికి పలువురు నివాళి

మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరంలో బొబ్బిలి రత్తయ్యనాయుడు మాతృమూర్తి సీతామహలక్ష్మి మృతి చెందింది. ఆమె భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీమంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) బుధవారం సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ (రాము) జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బోణం శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు బేతపూడి ఏశాపురాజు, కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాంబాబు, ఎస్



సీతామహలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాని, మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

రామాంజనేయులు, బి గోకర్ణయాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇంటి నాగరాజు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ

గుడివాడరూరల్: మాదకద్రవ్యాల వల్ల విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సులో ఆయన బుధవారం పాల్గొని ప్రసంగించారు. డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ ఆదేశాల మేరకు పలు కాలేజ్‌ల్లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నషముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు గూడపాటి శిరీష, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మొవ్వ సీడీపీవో

మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన

మొవ్వ: ఐసీడీస్ ప్రాజెక్టు పరిధిలోని పీఎం శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు ఉత్పత్తులు, గంజాయి, లాంటి మాదకద్రవ్యాలతో ఆరోగ్యాలను చెడగొట్టుకోవద్దని సీడీపీవో ఎస్.ప్రసన్న విశ్వనాథ్ సూచించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు వద్దు ఆరోగ్యమే ముద్దు నినాదాలతో ర్యాలీ నిర్వహించి అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శ్రీదేవి, మొవ్వ సెక్టార్ సూపర్‌వైజర్ రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

నిమ్మకూరు(మొవ్వ): మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ చైర్ పర్సన్ పీతల సుజాత అన్నారు. మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో ప్రధానమంత్రి విశ్వకర్మ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు. ముందుగా నిమ్మకూరు గ్రామంలోని ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా ప్రాంగణంలో శిక్షణ ఇచ్చే పలు బ్లాక్‌లను సందర్శించారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను ఆమె దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి భవన నిర్మాణానికి తన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం నిమ్మకూరు



సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న చైర్మన్ పీతల సుజాత

సర్పంచ్ శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం అధికారి, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరు పల్లి గణేష్, సీడీపీవో భాను శ్రీ, సర్పంచ్ శ్రీనివాసరావు, ప్రాంగణం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గుడివాడ టౌన్: ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని జెఎన్‌టీయూ కాకినాడ డైరెక్టర్ డాక్టర్ కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం స్థానిక ఏఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతులు ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రొఫెసర్‌లు చెబుతున్న పాఠ్యాంశాలను శ్రద్ధగా వింటూ నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు ప్రతి విద్యార్థీ శ్రద్ధగా చదివి కళాశాల గౌరవాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల



ప్రసంగిస్తున్న డైరెక్టర్ డాక్టర్ కొల్లు రవీంద్ర

ప్రిన్సిపాల్ ఎ. రామారావు, ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేసీకి వినతిపత్రం అందజేత

మండవల్లి: ఏలూరు కలెక్టర్ ఆఫీస్ నందు జాయింట్ కలెక్టర్‌కు బుధవారం బీఆర్ అంబేద్కర్ అభివృద్ధి కమిటీ ఉనికిలి ప్రెసిడెంట్ కాటి సురేష్ వినతిపత్రం అందజేశారు. 1988వ సంవత్సరంలో ఫీల్డు లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులైన దళితులకు అందించిన భూములకు సంబంధించి 76.14 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించి సొసైటీ భూమిని కాజేయడానికి యత్నిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జేసీకి వినతిపత్రం అందజేశారు.

మండవల్లిలో తిరంగా ర్యాలీ



మండవల్లి: స్థానిక పంచాయతీరాజ్ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం తిరంగర్యాలీ నిర్వహించారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని పీఆర్ డీఈ వెంకటేశ్వరరావు తెలిపారు. దేశభక్తిని పెంపొందించుకుని దేశ ఐక్యతను కాపాడాలని కోరారు.

అవయవ దానంపై అవగాహన అవసరం



పెనమలూరు: విద్యార్థులు అవయవ దానంపై అవగాహన పొందాలని ఏపీ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.మోహన్ అన్నారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబీ యూనవర్సిటీలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, మణిపాల్ ఆస్పత్రి సంయుక్తంగా అవయవ దానంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సేవపై కూడా దృష్టిపెట్టాలన్నారు. సమాజ సేవ చేయటం వలన విద్యార్థుల్లో బాధ్యత పెరుగుతుందని తెలిపారు. మణిపాల్ ఆస్పత్రి డైరెక్టర్ జె.రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ.. అవయవ దానంలో మహిళలు ముందంజలో ఉన్నారన్నారు. భారత ప్రభుత్వం జీవన్‌ధాన్‌తో అవయవ దానం ద్వారా రెండో సారి జీవించే అవకాశం కలిగించిందన్నారు. కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, ప్రొ.వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రవిచంద్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.శివరామప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.మాధవి తదితరులున్నారు.